క్లుప్తంగా

మోదీతోనే దేశాభివృద్ధి

కడప కోటిరెడ్డిసర్కిల్: ప్రధాని మోదీ పాలనలో భారతదేశం ప్రపంచంలో అగ్రగామి దేశంగా అభివృద్ధి చెంది అనేక రంగాలలో ముందుకు కొనసాగుతోందని బీజేపి కడప పార్లమెంటు కన్వీనర్ బాలకృష్ణ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి అన్నారు. శుక్రవారం కడప నగరంలోని ఆర్‌కే నగర్‌లో ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. బీజేపి నాయకులు లక్ష్మణరావు, మధుసూదన రెడ్డి, కళ్యాణ్,గజ్జల రామకృష్ణారెడ్డి, అనంత కేశవ, అమర్‌నాథ్‌రెడ్డి, గంగాప్రసాద్, నాగిరెడ్డి, నరేంద్రరెడ్డి, చంద్ర తదితరుతు పాల్గొన్నారు.

ఎస్‌ఐ అభ్యర్థులకు ఈవెంట్స్ నిర్వహించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈవెంట్స్‌ను వెంటనే నిర్వహించాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు నాలుగు నెలలయినా ఈవెంట్స్‌ను నిర్వహించకపోవడం దారుణమన్నారు. పోలీస్ నోటిఫికేషన్, ప్రిలిమినరీ పరీక్షలు నిర్వహించి ఐదు నెలలు గడిచినా దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహించకపోవడంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. గ్రూప్స్, డీఎస్సీకి నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. డీవైఎఫ్‌ఐ నాయకులు ఓబులేసు, డేవిజ్‌రాజ్ పాల్గొన్నారు.

'బ్రౌన్' బాధ్యుల ఉద్యోగవిరమణ

కడప కల్చరల్ : సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం బాధ్యుడిగా ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి జూన్ 30 శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. 2017 నుంచి 2023 వరకు సుదీర్ఘకాలం బాధ్యులుగా, సంచాలకులుగా తనదైన ముద్రతో బ్రౌన్ గ్రంథాలయం అభివృద్ధికి కృషి చేశారు. నూతన నియామకం జరిగే వరకు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ పాలనాబాధ్యతలు పర్యవేక్షిస్తారు.

అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్

కడప కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో ముందుకు వెళుతోందని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు శివా నాయక్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక నిహార్ స్కిల్ డెవెలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ అమలు పరిచామన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాల గూర్చి డా. వారణాసి ప్రతాప్‌రెడ్డి వివరించారు. డా. సొహైల్ అహమ్మద్, డా. సతీష్‌రెడ్డి, డా. క్రిష్ణార్జున్, డా. స్టీఫెన్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష...పేద ప్రజలకు రక్ష

ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం : జగనన్న సురక్ష...పేద ప్రజలకు రక్ష అని ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కమలాపురం వార్డు–1 సచివాలయం పరిధిలో 16, 19 మున్సిపల్ వార్డుల పరిధిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజల నుంచి రేషన్ కార్డు, సీసీ రోడ్లు, ఇంటి స్థలాలు, పక్కా గృహాలు కావాలని వినతులు అందడంతో అక్కడే ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. ఇంకా పథకాలు రానివి ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు సూచించారు. మీ సమస్యలు తెలుసుకోవడానికే,


ప్రజలకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

అపరిష్కృతంగా ఉన్న సమస్యలను సంతృప్త స్థాయిలో పరిష్కరించడం కోసమే జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని సీఎం జగనన్న ప్రారంభించారన్నారు. అర్హులుగా ఉన్నప్పటికి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకుండా ఉంటే వారిని గుర్తించి పథకాలు అందించడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అవ్వా తాతల పింఛన్ జనవరి నెల నుంచి రూ.3 వేలకు పెరుగుతుందన్నారు.

హామీలిచ్చి విస్మరించిన చంద్రబాబు:

చంద్రబాబు నాయుడు వేల దొంగ హామీలిచ్చి సీఎం అయ్యారని ఒక్కటి నెరవేర్చలేదన్నారు. బాబు తన పాలనంతా అవినీతికి కేరాఫ్‌గా పెట్టుకున్నారన్నారు. జన్మభూమి కమిటీలు లంచాలు, కమీషన్లు ఇచ్చిన వారికే అరకొర పథకాలు ఇచ్చారన్నారు. జగనన్న వ్యవసాయ రుణాలన్నీ మాఫీ చేస్తానని ఒక్క దొంగ హామీ ఇచ్చి ఉంటే 2014లోనే సీఎం అయ్యేవారన్నారు. కార్యక్రమంలో సంబటూరు ప్రసాద్‌రెడ్డి, ఉత్తమారెడ్డి, రాజుపాళెం సుబ్బారెడ్డి, ఎన్‌సీ పుల్లారెడ్డి, సీఎస్ నారాయణరెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, మోహన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, వంశీధర్‌రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, మస్తానయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, టీవీ సుబ్బరాయుడు, మహ్మద్ సాదిక్, గఫార్, హిదాయత్, ఖాజా హుసేన్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

వల్లూరు : కమలాపురం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 11 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందచేశారు. కడప నగరంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో శుక్రవారం 11 మంది లబ్ధిదారులకు రూ 21,37,000 విలువ చేసే చెక్కులను ఆయన అందజేసి మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తూ వైద్యరంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నాడన్నారు. వివిధ మండలాల వైఎస్‌ఆర్‌సీపీ నేతలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల స్వచ్ఛభారత్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలోని గురుకులం భవనాల్లో శుక్రవారం జాతీయ సేవాపథకం వలంటీర్లు స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. సరిత ఆధ్వర్యంలో ప్రాంగణంలోని వ్యర్థాలను, పిచ్చిమొక్కలను తొలగించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి వలంటీర్ల సేవలను అభినందించారు.

అమ్మవారికి సువర్ణాభరణం

కడప కల్చరల్ : దేవునికడప శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తులు శుక్రవారం సువర్ణ ఆభరణాన్ని అందజేశారు. స్థానిక చంద్రశేఖర్ దంపతులు మొక్కుతీర్చుకోవడంలో భాగంగా శ్రీపద్మావతి అమ్మవారికి మహామాంగల్యాన్ని అందజేశారు. వారు చాలాకాలంగా చెన్నైలో ఉంటున్నారు. 40 గ్రాముల రెండు తాళిబొట్లు, సూత్రం అందజేశారు. పూజల అనంతరం వాటిని స్వామిసన్నిధిలో ఆలయ ఇన్‌స్పెక్టర్ ఈశ్వరరెడ్డి పర్యవేక్షణలో మయూరం కృష్ణమోహన్‌కు అందజేశారు దాతలను స్వామి, అమ్మవార్ల శేషవస్త్రం, ప్రసాదంతో సత్కరించారు.


సువర్ణ ఆభరణాన్ని అందజేస్తున్న దాత

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

కడప ఎడ్యుకేషన్: జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం కడపకు వచ్చిన విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాష్‌ను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సంబంధిత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి తెలిపారు. వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర నాయకులు సజ్జల వెంకట రమణారెడ్డి ఆయన్ను కలిసినవారిలో ఉన్నారు.


ప్రవీణ్ ప్రకాష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

గురుకుల ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులను ఆదుకోవాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల శివార్జున అన్నారు. శుక్రవారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘ కార్యాలయంలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో గిరిజన సంక్షేమ గురుకులాల్లో ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకం జరిగిందన్నారు. ఆర్థికశాఖ నుంచి పర్మిషన్ లేదని వీరిని జూన్ నెలలో హోల్డ్‌లో ఉంచారన్నారు.వీరి విషయంలో ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు గంగరాజు, కార్యదర్శులు కట్టా గంగాధర్, శేషగిరిరావు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీని అడ్డుకోవడం దారుణం

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: మణిపూర్‌లో కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీని పోలీసులు అడ్డుకోవడం దారుణమని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు విష్ణు ప్రీతం రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మణిపూర్ కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీని అడ్డుకోవడాన్ని నిరసిస్తూ నగరంలోని అంబేడ్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. చెప్పలి పుల్లయ్య, చార్లెస్, నాయకులు బాబు, సుబ్బారెడ్డి, పాలగిరి శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఉద్యమం ఉధృతం

కడప కార్పొరేషన్: విద్యుత్ చార్జీలు తగ్గించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని అఖిలపక్ష నేతలు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక విద్యుత్ భవన్ ఎదుట అఖిల పక్ష పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలను పెంచారని, స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారం మోపే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఇళ్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగించాలనుకోవడం దారుణమన్నారు. ప్రజల గోడును ముఖ్యమంత్రికి చెప్పేందుకు జూలై 5న ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు గాలి చంద్ర, చంద్రశేఖర్, టీడీపీ నేతలు అమీర్‌బాబు, లక్ష్మిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సత్తార్, బండి జకరయ్య, బీసీ మహాసభ నేత అవ్వారు మల్లికార్జున, బీఎస్‌సీ నేత గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ భవన్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్ష , ప్రజా సంఘాల నాయకులు

20 కుటుంబాలు వైఎస్ఆర్ సీపీలో చేరిక

చెన్నూరు : 11వ వార్డు చౌడమ్మ వీధికి చెందిన టీడీపీ బీసీ నాయకులు మాజీ ఎంపీటీసీ అల్లి శ్రీరామమూర్తి ఆ పార్టీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనతోపాటు తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు తన్వీర్ వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. వీరితోపాటు 20 కుటుంబాలు తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే పోచంరెడ్డి రవీంద్రనాథ్రెడ్డి పార్టీ కండువా కప్పి సాధారణంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ అభివృద్ధిని చూసి పార్టీలో చేరా.... ఈ సందర్భంగా అల్లి శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న పాలనకు ఆకర్షితులమై పార్టీలో చేరామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీ తెలుగుదేశం పార్టీ వారు అలాగే మైనార్టీ వర్గానికి చెందినవారు పార్టీ లో చేరడం చాలా సంతోషంగా ఉందన్నారు. పార్టీలో చేరిన పోస వెంకటనారాయణ, కాటం వెంకట రమణ, ఉట్టి రెడ్డయ్య, మచ్చ అరవింద్, గోదిన సుబ్బరాయుడు, అల్లి కళావతి, నున్న నాగిని, బత్తల శ్రీనివాసులు, యనమల వెంకటసుబ్బయ్య, గోదినా చంద్ర శేఖర్, లను ఆయన పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.ఎన్. భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్లసురేష్ యాదవ్, టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, మైనార్టీ నాయకులు అన్వర్ బాషా, అబ్దుల్ రబ్, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

ఘనంగా సేవా కార్యక్రమాలు

కడప కార్పొరేషన్: కడప మేయర్ సురేష్ బాబు తనయుడు అమరేష్ బాబు (రుషి) జన్మదిన వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అపూర్వ కళ్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, అనిల్, సుబ్బరాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. మేయర్ , పార్టీ నేతలు పాల్గొన్నారు.

– నగరంలోని జువెనైల్ హోంలో 42వ డివిజన్ ఇన్‌చార్జి చల్లా రాజశేఖర్ ఆధ్వర్యంలో బాలలకు అన్నదానం చేశారు. పాతరిమ్స్‌లోని అల్‌షిఫా మానసిక వికలాంగుల కేంద్రంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ కంతా భరత్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

– ప్రకాష్‌నగర్‌లోని వృద్ధాశ్రమంలో 14వ డివిజన్ కార్పొరేటర్ కె. బాబు వృద్ధులకు చికెన్ బిర్యానీ ప్యాకెట్లను అందజేశారు. ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– 34వ డివిజన్ ఖలీల్ నగర్‌లో డివిజన్ ఇన్‌చార్జి అలీ అక్బర్ విద్యార్థులకు పుస్తకాలు, వాటర్ బాటిల్స్, నోట్ బుక్స్, ప్యాడ్స్ పంపిణీ చేశారు.


వృద్ధులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేస్తున్న అమరేష్ బాబు, కార్పొరేటర్ కె. బాబు

వైద్యులు దైవంతో సమానం

కడప ఎడ్యుకేషన్: వైద్యులు దైవంతో సమానమని టీడీపీ కడప సిటి ఉపాధ్యక్షుడు కొండాసుబ్బయ్య అన్నారు. డాక్టర్స్ డేని పురస్కరించుకుని శుక్రవారం కడప నగరంలోని మెడికేర్ హాస్పిటల్ వైద్యుడు డాక్టర్ మహబూబ్‌ఆలీని ఆయన అభినందించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు ఉచితంగా వైద్య సేవలందించడం గొప్ప విషయమన్నారు. పలువురు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

రేపు ఆఫీసర్స్‌క్లబ్‌లో మెగా వైద్యశిబిరం

కడప స్పోర్ట్స్:కడప నగరంలోని కడప ఆఫీసర్స్ క్లబ్‌లో ఈనెల 2వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కడప ఆఫీసర్స్‌క్లబ్ కార్యదర్శి పి. యదుభూషణ్‌రెడ్డి తెలిపారు. ఉదయం 7 నుంచి ఉచిత రక్త, షుగర్, కిడ్నీ పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నగర ప్రజలు, క్లబ్ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వైవీయూ పరీక్షలు తనిఖీ చేసిన సీఈ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీ కళాశాలల సెమిస్టర్ పరీక్షలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు. శుక్రవారం రైల్వేకోడూరు, ఓబులవారిపల్లె, రాజంపేటలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు.


పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఈశ్వరరెడ్డి

డాక్టర్ ఫజిల్ రెహమాన్ సేవలు ఎనలేనివి


డాక్టర్ ఫజిల్ రెహమాన్‌ను సన్మానిస్తున్న, ప్రిన్సిపాల్ సురేఖ, ఇతర వైద్యులు

కడప అర్బన్: సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫజిల్ రెహమాన్ సేవలు ఎనలేనివని వైద్యులు కొనియాడారు. కడప నగర శివార్లలోని ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో ఈఎన్‌టి విభాగంలో సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫజిల్ రెహమాన్ శుక్రవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా డాక్టర్ ఫజిల్‌ను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ ఆధ్వర్యంలో సన్మానించారు. వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీనివాసనాయక్, డాక్టర్ వరలక్ష్మి, హెచ్‌ఓడిలు, వైద్యులు పాల్గొన్నారు.